# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 30-03-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. దేశ అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న' ప్రదానోత్సవం దిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఈ రోజు జరిగింది.**

**2. తొలి దశ పోలింగ్ ప్రారంభం నుంచి చివరి దశ పోలింగ్ ముగిసే వరకూ ఎగ్జిట్ పోల్స్ నిర్వహణ, ప్రసారం, ప్రచురణ చేపట్టకూడదని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.**

**3. వచ్చే విద్యా సంవత్సరానికి అవసరమైన 4 కోట్ల 42 లక్షల పాఠ్య పుస్తకాల ముద్రణ ప్రక్రియ ప్రారంభమైందని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ తెలిపారు.**

**4. మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి కర్నూలు జిల్లా తుగ్గలిలో ప్రజలతో ముఖాముఖి నిర్వహించారు.**

**5. వైఎస్ఆర్ జిల్లా ప్రొద్దుటూరులో జరిగిన "ప్రజాగళం" బహిరంగ సభలో తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు పాల్గొన్నారు.**

==========================

దేశ అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న' ప్రదానోత్సవం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఈ రోజు జరిగింది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈ పురస్కారాలను ప్రదానం చేశారు. పలు రంగాల్లో దేశానికి సేవలందించిన ఐదుగురు ప్రముఖులకు ఈ ఏడాది మూడు విడతల్లో 'భారతరత్న' ప్రకటించారు. బిహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరీ ఠాకుర్, భారతీయ జనతా పార్టీ అగ్రనేత ఎల్.కె.ఆద్వానీ, మాజీ ప్రధానమంత్రులు పీవీ నరసింహారావు, చౌదరీ చరణ్‌సింగ్, వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్. స్వామినాథన్‌ను ఈ అత్యున్నత పురస్కారంతో గౌరవించారు. ఇందులో నలుగురికి మరణానంతరం ఈ అవార్డు లభించగా.. ఈ రోజు వారి కుటుంబసభ్యులకు పురస్కారాన్ని ప్రదానం చేశారు. మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు తరఫున ఆయన కుమారుడు ప్రభాకర్‌రావు ఈ పురస్కారాన్ని రాష్ట్రపతి నుంచి స్వీకరించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోదీ రేపు ఆద్వానీ నివాసానికి వెళ్లి 'భారతరత్న' ప్రదానం చేయనున్నారు.

--------------------------

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎగ్జిట్ పోల్స్‌కు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం కీలక ఆదేశాలు జారీ చేసింది. తొలి దశ పోలింగ్ జరిగే ఏప్రిల్ 19వ తేదీ ఉదయం 7 గంటల నుంచి చివరి దశ పోలింగ్ రోజు

అయిన జూన్ 1వ తేదీ సాయంకాలం 6 గంటల 30 నిమిషాల వరకూ ఎగ్జిట్ పోల్స్ నిర్వహణ, ప్రసారం, ప్రచురణ చేపట్టకూడదని స్పష్టం చేసింది. ఈ మేరకు నోటిఫికేషన్ జారీ చేసింది. అలాగే పోలింగ్ ముగియడానికి 48 గంటల ముందు నుంచి ఎలక్ట్రానిక్ ప్రసార మాధ్యమాల్లో ఫలితాల గురించి అంచనాలతో పాటు ఇతర ఎలాంటి సర్వేలనూ ప్రసారం చేయకూడదని పేర్కొంది.

---------------------------

18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకొని రాబోయే లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. తిరుపతి జిల్లా చంద్రగిరి పట్టణంలోని ప్రత్యంగిరా అమ్మవారి ఆలయం నుండి చంద్రగిరి కోట వరకు ఓటరు నమోదుకు అవగాహన కల్పించే లక్ష్యంతో మోటార్ సైకిల్ ర్యాలీని ఈ రోజు ఉదయం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటు హక్కు వినియోగించుకోవడం ద్వారా ప్రజా స్వామ్యాన్ని కాపాడుకుందామని కోరారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా తప్పక నమోదు చేసుకోవాలని, ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

---------------------------

2024-25 విద్యా సంవత్సరానికి అవసరమైన 4 కోట్ల 42 లక్షల పాఠ్య పుస్తకాల ముద్రణ ప్రక్రియ ప్రారంభమైందని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ తెలిపారు. జూన్ 12వ తేదీ నాటికి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ఉచితంగా అందించేందుకు సిద్ధంగా ఉంచుతామని నిన్న ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తొలిసారిగా "ఫ్యూచర్ స్కిల్స్"ను ఒక సబ్జెక్ట్‌గా ప్రవేశపెట్టి 8వ తరగతి విద్యార్థులకు సంబంధిత పుస్తకాలను అందజేస్తామన్నారు. 3 నుండి 9వ తరగతి విద్యార్థులు టోఫెల్ పరీక్షలకు మరింత మెరుగ్గా సంసిద్ధమయ్యేందుకు వీలుగా వారికి టోఫెల్ వర్క్ బుక్‌లు అందిస్తామని ప్రవీణ్ ప్రకాష్ వెల్లడించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని ఆదర్శ పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి ఆరవ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ తెలిపారు. రేపటి నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకు పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఆయన నిన్న ఒక ప్రకటనలో సూచించారు. ప్రవేశపరీక్ష ఏప్రిల్ 21వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా జరుగుతుందని.. 5వ తరగతి స్థాయిలో తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాలలో ప్రశ్నపత్రం ఉంటుందని పేర్కొన్నారు.

---------------------------

గత 58 నెలలుగా వివక్ష లేకుండా పాలన కొనసాగుతోందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా "మేమంతా సిద్ధం" పేరుతో ఆయన చేపట్టిన బస్సు యాత్ర ఈ రోజు కర్నూలు జిల్లా తుగ్గలికి చేరుకుంది. ఈ సందర్భంగా ప్రజలతో జగన్మోహన్ రెడ్డి ముఖాముఖి నిర్వహించారు. ఈ 58 నెలల పాలనలో గ్రామాల్లో అభివృద్ధి జరిగిందని తెలిపారు.

---------------------------

ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు వైఎస్ఆర్ జిల్లాలో పర్యటిస్తున్నారు. ప్రొద్దుటూరు పట్టణంలోని పుట్టపర్తి సర్కిల్‌లో జరిగిన "ప్రజాగళం" బహిరంగసభలో ఆయన మాట్లాడుతూ.. విద్య, తాగునీరు, సాగునీరు, పరిశ్రమల ఏర్పాటుతో రాయలసీమ స్థితిగతులు మారతాయని

తెలిపారు. సమృద్ధిగా సాగునీరు అందిస్తే కోనసీమను మించిన పంటలు రాయలసీమలో సాగు చేసేందుకు వీలుంటుందని చంద్రబాబునాయుడు పేర్కొన్నారు.

---------------------------

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు ప్రభుత్వ పోర్టల్ అయిన జీఈఎమ్ ద్వారా జరిగిన వస్తువులు, సేవల సేకరణ 4 లక్షల కోట్ల రూపాయలు అధిగమించిందని ఆ పోర్టల్ ముఖ్య కార్యనిర్వహణాధికారి పీకే సింగ్ పేర్కొన్నారు. వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాల నుంచి అధిక కొనుగోలు కార్యకలాపాలు జరగడం ఇందుకు దోహదం చేసిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వంలోని అన్ని మంత్రిత్వ శాఖలు, విభాగాలు ఆన్‌లైన్‌లో వస్తువులు, సేవలను కొనుగోలు చేయడానికి 2016 ఆగస్టు 9వ తేదీన గవర్న్‌మెంట్ ఇ-మార్కెట్.. జీఈఎమ్‌ను ప్రభుత్వం ఆవిష్కరించింది.

---------------------------

ఎన్నికల సంఘం ఆదేశం మేరకు ఓటరు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎన్.టి.ఆర్. జిల్లా కలెక్టర్ దిల్లీరావు చెప్పారు. ఓటు ప్రాముఖ్యత వివరించే ఉద్దేశ్యంతో చేపట్టిన 2 కిలోమీటర్ల స్వీప్‌రన్‌ను విజయవాడలోని అంబేద్కర్ స్మృతి వనం నుండి పోలీస్ కమిషనర్ క్రాంతిరాణా టాటాతో కలిసి ప్రారంభించారు. గత ఎన్నికల్లో తక్కువ పోలింగ్ నమోదైన ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని ఆయన పేర్కొంటూ.....

**......వాయిస్.... 30 సెకన్లు......**

---------------------------

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ఏప్రిల్ 17వ తేదీన శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆస్థానం నిర్వహిస్తామని తిరుమల తిరుపతి దేవస్థానం ఒక ప్రకటనలో తెలిపింది. శ్రీరామచంద్రమూర్తి హనుమంత వాహనంపై మాడవీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనమిస్తారని పేర్కొంది. అదేవిధంగా శ్రీవారి ఆలయంలో ఏప్రిల్ 18వ తేదీ శ్రీరామ పట్టాభిషేకం నిర్వహిస్తారు.

---------------------------

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న కారణంగా మొబైల్ ఫోన్ నెంబరును తొలగిస్తామంటూ కొందరు కేంద్ర టెలికమ్యూనికేషన్ శాఖ పేరుతో వినియోగదారులకు ఫోన్ చేసి బెదిరిస్తున్నారని ఆ శాఖ పేర్కొంది. అవన్నీ నకిలీ కాల్స్ అని, వాటిపై వెంటనే ఫిర్యాదు చేయాలంటూ నిన్న ఒక సూచన జారీ చేసింది. ఇలాంటి కాల్స్‌తో సైబర్ నేరగాళ్లు.. వినియోగదారుల వ్యక్తిగత సమాచారాన్ని దొంగిలించి ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతుంటారని హెచ్చరించింది. ఇలాంటి ఫోన్ కాల్స్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. వెంటనే "సంచార్ సాథీ" పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని కేంద్ర టెలికమ్యూనికేషన్ శాఖ సూచించింది.

---------------------------

స్వచ్ఛంద సేవా సంస్థలు..ఎన్‌జీవోలు విదేశీ నిధులను స్వీకరించడానికి అనుమతుల పునరుద్ధరణ గడువును పొడిగిస్తూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. విదేశీ విరాళాల నియంత్రణ చట్టం..ఎఫ్‌సీఆర్ఏ కింద నమోదు చేసుకుని విదేశీ నిధులను స్వీకరించడానికి అనుమతులు తీసుకొన్న ఎన్‌జీవో సంస్థల లైసెన్స్‌ను ఈ నెల 31వ తేదీ వరకూ పొడిగిస్తూ గత ఏడాది సెప్టెంబరు 25వ తేదీన కేంద్ర హోంమంత్రిత్వశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పుడు ఆ గడువును జూన్ 30వ తేదీ వరకూ పొడిగిస్తూ మరోసారి ఉత్తర్వులు జారీ చేసింది.

======================